క్లుప్తంగా

కోన వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న స్వామివారు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోన వేంకటేశ్వర స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో భూదేవి, అలివేలి మంగమ్మ సమేత స్వామివారి మూల విగ్రహాలకు అభిషేకాలు, అర్చనలు, పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక గ్రామస్తులతో పాటు, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకూర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు కొండపైకి చేరి ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామి వారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కొండపై గ్రామస్తులు, భక్తులకు స్వామివారి ప్రసాదంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వేతనం రూ.307 వచ్చేలా పని చేయాలి



మస్టర్లను తనిఖీ చేస్తున్న పీడీ సూర్యనారాయణ

పాణ్యం: ఉపాధి పథకంలో పని చేసే కూలీలు కనీసం వేతనం రూ. 307లు వచ్చేలా పని చేయాలని డ్వామా పీడీ సూర్యనారాయణ అన్నారు. శనివారం పాణ్యం మండలం సుగాలి మెట్ట, తమ్మరాజుపల్లె పరిధిలోని కొచ్చెరువులో పూడిక తీత పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కూలీలు పని వేళలు పాటించాలన్నారు. మెట్ట పొలాలో పండ్ల తోటలు సాగు చేసుకునే రైతులకు వందశాతం రాయితీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే కంపోస్టు పిట్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ శేషన్న, ఈసీ శివారెడ్డి, టీఏ ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీ నారాయణమ్మ, మేటీలు పాల్గొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

కల్లూరు: కల్లూరు అర్బన్ పరిధి పందిపాడు వద్ద ఉన్న టీజీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. కల్లూరు గ్రామీణ మండలం, అర్బన్ వార్డుల విస్తృత స్థాయి సమావేశం ఉంటుందన్నారు. కావున కల్లూరు గ్రామీణ, 16 వార్డుల పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రేపటి నుంచి ఎస్సార్బీసీకి నీరు

పాణ్యం: గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ఎస్సార్బీసీకి సోమవారం నుంచి నీటిని విడుదల చేస్తామని ఎస్సార్బీసీ ఇన్‌చార్జ్ ఎస్ఈ సుభకుమార్ శనివారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 14వ తేదీన గోరుకల్లు ఓటీ ద్వారా ఎస్సార్బీసీకి నీటిని విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం గోరుకల్లు జలాశయంలో మూడు టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. కాల్వల మరమ్మతుల పనులు పూర్తి కాగానే బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి గోరుకల్లు జలాశయంలోకి నీటిని వదులుతామన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఓర్వకల్లు: మండలంలోని శకునాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సీఆర్పీ మల్లికార్జున శనివారం తెలిపారు. పాఠశాలలో చదువుకున్న 2000-2001 బ్యాచ్‌కి చెందిన 10వ తరగతి విద్యార్థులు నిర్వహిస్తున్న సమావేశంలో ఆనాటి గురువులతో పాటు, ప్రస్తుత ఉపాధ్యాయులను సన్మానిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు 25 (సిల్వర్ జూబ్లీ) ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా గురువులకు సన్మానంతో పాటు, గురు దక్షిణగా జ్ఞాపికలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు హాజరై, జయప్రదం చేయవల్సిందిగా ఆయన కోరారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

కల్లూరు: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎ. గోకులపాడు గ్రామానికి చెందిన అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సాగునీరు అందించి ఆదుకోండి

సి.బెళగల్: గ్రామంలో సాగు, తాగునీటి సమస్యను పరిష్కరించాలని బురాన్‌దొడ్డి వాసులు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని కోరారు. శనివారం మండల పరిధిలోని బురాన్‌దొడ్డి గ్రామంలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తుంగభద్ర నది నుంచి పుల్లకూర్తి ఎత్తిపోతల పథకం, ఎల్ఎల్‌సీ కాలువ ద్వారా సి.బెళగల్ చెరువుకు నీటిని మళ్లించి సాగు,తాగునీటి సమస్య పరిష్కరించాలని సర్పంచ్ రామాంజనేయులు, గ్రామ పెద్దలు ఎమ్మెల్యేను అడిగారు. గ్రామంలో అసంపూర్తిగా ఉన్న గౌకరమయ్య దర్గా రోడ్డు నిర్మాణాన్ని సైతం పూర్తి చేయాలని కోరారు.



నాడు



నాడు కళతప్పిన వినాయక ఘాట్ స్ట్రీట్ మార్కెట్

నాడు వినాయక్ ఘాట్ వద్ద రూ.20లక్షల వ్యయంతో హాకర్స్ జోన్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకం



కళతప్పిన ‘స్ట్రీట్ మార్కెట్’

కర్నూలు (న్యూటౌన్): ఏడాది క్రితం చిరువ్యాపారులతో కళకళలాడిన స్ట్రీట్ మార్కెట్ నేడు వెలవెలబోతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారిని పట్టించుకోకపోవడంతో జీవనోపాధి భారమై రోడ్డున పడాల్సి వచ్చింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వీధి వ్యాపారులకు అండగా నిలబడింది. ఎలాంటి పూచీకత్తు లేకుండా బ్యాంకు రుణంతో పాటు వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత తదితర పథకాల ద్వారా లబ్ధి చేకూర్చింది. అంతేకాదు మునిసిపాలిటీలు, నగర పాలక సంస్థల్లో వ్యాపారాలు చేసుకునేందుకు వీలుగా ప్రత్యేకంగా గుర్తింపు కార్డులు జారీ చేసి స్ట్రీట్ మార్కెట్‌లు ఏర్పాటు చేసింది. జీవనోపాధికి భరోసా ఇచ్చే ఇలాంటి స్ట్రీట్ మార్కెట్‌ను కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలో వినాయక ఘాట్ వద్ద రూ. 20లక్షలతో గతేడాది ఫిబ్రవరి 1న ప్రారంభించింది. అయితే, గతేడాది జూన్‌లో కూటమి సర్కారు ఏర్పడటంతో చిరు వ్యాపారులకు కష్టాలు మొదలయ్యాయి. వ్యాపారాలు పడిపోవడం.. ప్రభుత్వం నుంచి పైసా సాయం లేకపోవడంతో జీవితం దుర్భరమై కొందరు వ్యాపారాలు మానుకోగా.. మరికొందరు రోడ్లపై వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఫలితంగా నాటి స్ట్రీట్ మార్కెట్ నేడు వెలవెలబోతూ యాచకులు, మందుబాబులకు అడ్డాగా మారింది.

మధ్యవర్తిత్వంతో అనేక లాభాలు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న లీగల్ డిఫెన్స్ కౌన్సిల్, న్యాయవాదులు

కర్నూలు(అర్బన్): మధ్యవర్తిత్వం ద్వారా అనేక లాభాలు ఉన్నాయని లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ డిప్యూటీ శివరామ్, మీడియేటర్స్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ప్రసాద్ చెప్పారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వ విభాగం సూచనలు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకటశేషాద్రి ఆదేశాల మేరకు మధ్యవర్తిత్వంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం దేశ వ్యాప్తంగా 90 రోజులు జరుగుతుందన్నారు. మధ్యవర్తిత్వాన్ని ఉపయోగించి కేసులను త్వరగా పరిష్కరించుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. మధ్యవర్తిత్వం ప్రక్రియలో సమయం వృథా కాదని, ముఖ్యంగా డబ్బు కూడా వృథా కాదన్నారు. ఈ నేపథ్యంలోనే వారు మధ్యవర్తిత్వం- దేశం కోసం అనే బ్యానర్లతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ట్రయినింగ్ న్యాయవాదులు బాలాజీ, సుమలత, వినోద్‌కుమార్, న్యాయవాది ప్రేమ్‌కుమార్, ప్యారా లీగల్ వలంటీరు మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీ సిద్ధి వినాయక సంగీత నిలయం వార్షికోత్సవం

కర్నూలు కల్చరల్: శ్రీ సిద్ధి వినాయక సంగీత నిలయం వార్షిక సాంస్కృతిక కార్యక్రమాలు ఆదివారం సాయంత్రం 6 గంటలకు సీ క్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, ప్రముఖ గ్రాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ, ప్రభుత్వ శారదా సంగీత నృత్య కళాశాల విశ్రాంత గురువులు సరస్వతమ్మ అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

రహదారి భద్రతపై పోలీసుల తనిఖీలు



డ్రంకెన్ డ్రైవ్ టెస్టు నిర్వహిస్తున్న పోలీసులు

కర్నూలు: రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా పోలీసులు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీస్‌స్టేషన్ల వారీగా అధికారులు తనిఖీలు నిర్వహించి వాహనదారులకు రహదారి నిబంధనల గురించి వివరించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలని, బైకు నడిపేవారు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. ఓవర్ స్పీడ్, ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనదారులకు కౌన్సిలింగ్ ద్వారా తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతుండటం ద్వారా ఇటీవల ప్రమాదాలు పెరుగుతుండటంతో పోలీస్‌స్టేషన్ల వారీగా డ్రంకెన్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి రోడ్డు భద్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

వాహన డ్రైవర్ల సంఘం అధ్యక్షుడి సభ్యత్వం రద్దు

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు సభ్యత్వం రద్దు చేస్తూ రాష్ట్ర సంఘం జనరల్ బాడీ సమావేశం తీర్మానించింది. అధ్యక్షుడిగా నాగేశ్వరరావు పదవీ కాలం పూర్తి అయినప్పటికీ చట్ట విరుద్ధంగా కొనసాగడంతో పాటు సంఘానికి సంబంధించిన రికార్డులు, సంఘం భవనం స్వాధీనం చేయకుండా అడ్డుతగులుతున్నారని గుంటూరులో శనివారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో చర్చకు వచ్చింది. రాష్ట్ర సంఘానికి సహకరించనందున సంఘంలో ఆయన సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తీర్మానం చేసింది. ఇక నుంచి మాజీ అధ్యక్షుడైన నాగేశ్వరరావు సంఘంలో సభ్యుడు కాదని రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి



నగరంలో అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీస్తున్న కమిషనర్ పి. విశ్వనాథ్

కర్నూలు (టౌన్): నగరంలో వివిధ దశల్లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కమిషనర్ అధికారులతో కలిసి పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. అలాగే 5వ శానిటేషన్ డివిజన్ కార్యాలయం, గడియారం ఆసుపత్రి, పాత తుంగభద్ర పంప్ హౌస్, వాహనాల మరమ్మతుల షెడ్, గార్గేయపురంలో బయో మైనింగ్, వీధి కుక్కల సంతాన నియంత్రణ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయా పనులు ఏయే దశల్లో ఉన్నాయని, వాటి పురోగతిపై ఆరా తీశారు. పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పనుల్లో జాప్యం తగదన్నారు. పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, తాగునీటి సరఫరా మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పు తీర్చే మార్గం లేక ఉద్యోగి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన శేషేంద్రనాథ్

కర్నూలు: ఇంటి నిర్మాణం, పిల్లల చదువులు, కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక కర్నూలు పశుసంవర్ధక శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దుద్యాల శేషేంద్ర నాథ్ (48) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన పసుపల గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లారెడ్డి వెంచర్‌లో కొత్తగా ఇల్లు నిర్మించుకున్నాడు. ఇందుకోసం బ్యాంకులో రూ.48 లక్షలు అప్పు చేశాడు. అలాగే పిల్లల చదువులు, కుటుంబ పోషణ కోసం కూడా బయట మరికొంత అప్పులు చేశాడు. వచ్చే జీతం బ్యాంకు ఈఎంఐ చెల్లింపులతో పాటు కుటుంబ పోషణకు సరిపోకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై ఇంటికి సమీపంలోని మసీదు దగ్గర ఉన్న బహిరంగ ప్రదేశంలో శుక్రవారం పురుగుల మందు తాగి ఇంటికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు కనుగొని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు చేయించగా కోలుకోలేక శనివారం ఉదయం మృతిచెందాడు. ఈయనకు వేణుమాధవ్, భానుకిరణ్ కుమారులు. భార్య దుద్యాల మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల సొమ్ము దోచిపెట్టేందుకే స్మార్ట్ మీటర్లు



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): ప్రజల సొమ్మును అదానికి దోచిపెట్టడానికే స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని సీపీఎం విమర్శించింది. శనివారం కల్లూరు, కర్నూలులో స్మార్ట్ మీటర్లు వద్దు అని సీపీఎం నాయకులు టి.రాముడు, సుధాకరప్ప విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 14వ తేదీన స్మార్ట్ మీటర్లను నిరసిస్తూ విద్యుత్ సౌధను ముట్టడించనున్నట్లు చెప్పారు. టీడీపీ నాయకులు అధికారంలో లేని సమయంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి..అధికారంలోకి రాగానే ఒప్పుకోవడం అన్యాయమన్నారు. మంత్రి లోకేష్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టాలని చెప్పి..ఇప్పుడు మాత్రం నోరు మెదపకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.భాస్కర్, లాల్ మహ్మద్ పాల్గొన్నారు.

వీడ్కోలు

కర్నూలు (టౌన్): నగరపాలక కమిషనర్‌గా పనిచేసి బదిలీపై వెళ్తున్న ఎస్.రవీంద్ర బాబుకు మేయర్ బీవై రామయ్య, మున్సిపల్ అధికారులు, పాలకవర్గ సభ్యులు ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం రాత్రి స్థానిక నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో వీడ్కోలు సభ నిర్వహించారు. మేయర్ బీవై రామయ్య, నూతన కమిషనర్ పి.విశ్వనాథ్, సిబ్బంది శాలువలు కప్పి బొకేతో సన్మానం చేశారు. సన్మాన గ్రహీత, కమిషనర్ మాట్లాడుతూ గత మూడు పర్యాయాలు కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్‌గా పని చేయడం ఆనందంగా ఉందన్నారు. సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి విశ్వేశ్వర్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘శ్రీనివాస రావు ఆరోపణలు అర్థరహితం’

కర్నూలు(సెంట్రల్): ఏపీ ప్రభుత్వవాహన డ్రైవర్ల సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షుడు వై.నాగేశ్వరరావుపై రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు చేసిన ఆరోపణలు అర్థరహితమని ఆ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు మబ్బులు, ఇబ్రహీం, ఇంకోబా, ఎస్ఎండీ గౌస్, దాదాబాషా, రమేష్, మధుసూదన్‌రావు, నాగరాజు, అంజాద్ పేర్కొన్నారు. శనివారం సీక్యాంపులోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్నూలుకు వచ్చి ఇష్టానుసారంగా సమావేశాలు ఏర్పాటు చేసి జిల్లా అధ్యక్షుడిపై అవినీతి ఆరోపణలు చేయడం తగదన్నారు. తన ఎదుగుదల ను చూసి ఓర్వలేకనే ఇలా చేస్తున్నారని జిల్లా అధ్య క్షుడు నాగేశ్వరావు ఈ సందర్భంగా పేర్కొన్నారు..

నడిరోడ్డుపై ఏర్పడిన గుంత



ఆదమరిస్తే అధోగతే..!

కోడుమూరు రూరల్: కోడుమూరులోని ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లో నడిరోడ్డుపై అడుగులోతుకు పైగా గుంతలేర్పడ్డాయి. వాహనదారులెవరైనా గమనించకుండా వెళితే కిందపడే ప్రమాదం ఉంది. పగటి వేళలో వాహనదారులు గుంతలను గమనించి వెళుతన్నా రాత్రి వేళల్లో ద్విచక్రవాహనదారులు గుంతలను గమనించకుండా వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు సకాలంలో గుంతలను పూడ్చకపోవడంతో అవి మరింత పెద్దగా మారి వాహనదారులకు ప్రమాదాలను తెచ్చిపెడుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడ్డ గుంతలకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం నగర కార్యదర్శి ఆర్. నరసింహులు, జిల్లా అధ్యక్షుడు కాజాపాషా పిలుపునిచ్చారు. శనివారం ఏపీ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం న్యూసిటీ, ఓల్డ్‌సిటీ సమితి సమావేశాలను వేర్వేరుగా ఇందిరాగాంధీనగర్, పెద్ద పార్కులలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని చెప్పిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదన్నారు. సంక్షేమ బోర్డు ఉంటే కార్మికులు ప్రమాదంలో మరణిస్తే రూ.10 లక్షలు, సాధారణ మరణం చెందితే రూ.5 లక్షలు ఇస్తారని, కార్మికులకు వేతనలతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం ఉంటుందన్నారు.

వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేద్దాం



కలిసొద్దాం కార్యకర్తను కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మోహన్ బాబు, వైస్ ఎంపీపీ నెహెమ్యా

కర్నూలు (రూరల్): గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ పేరపోగు మోహన్‌బాబు, కర్నూలు మండల వైస్ ఎంపీపీ నెహెమ్యా పిలుపునిచ్చారు. మండల పరిధిలోని నిడ్జురు గ్రామంలో శనివారం ‘కలిసొద్దాం కార్యకర్త’ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. అనంతరం గ్రామ కమిటీలు ఏర్పాటు చేశారు. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బి.తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్, కె. శ్రీరాములు, టి.రామ్‌రెడ్డి, ఎం.ప్రసాద్, ఎస్. మహబూబ్‌పీర్, బాషా, నాగులు, మోహన్‌బాబు, అల్లావుద్దీన్, లాలు, ఎల్లప్ప, బోయ బిచుపల్లి, బోయ చిరంజీవి, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

విశ్వజనీయమైనది విజ్ఞానం



మాట్లాడుతున్న విజ్ఞాన చింతన పరిశోధకులు, మాజీ ప్రొఫెసర్ దేవరాజు మహారాజు

కర్నూలు (న్యూటౌన్) : విజ్ఞానం విశ్వజనీయమైనదని విజ్ఞాన చింతన పరిశోధకులు, మాజీ ప్రొఫెసర్ దేవరాజు మహారాజు అన్నారు. నగరంలోని బీఏఎస్ కళ్యాణ మండపంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యారంగం.. వైజ్ఞానిక దృక్పథం సదస్సుకు ఆయన ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి సైన్స్ ఎంతో తోడ్పాటునిస్తుందన్నారు. సైన్స్ వాస్తవాలకు అద్దం పడుతుందన్నారు. మనిషికి అవసరాలను, పనులను సరళతరం చేస్తుందని చెప్పారు. నేడు మతతత్వం వల్ల సమాజం తీవ్ర స్థాయిలో కలుషితమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో దేవుడు, దయ్యాల పేరిట మూఢ నమ్మకాలు విస్తృతమవుతున్నాయన్నారు. మనిషిని మించిన అతీత శక్తి మరొకటి లేదని, మనిషి కేంద్రంగా అభివృద్ధి సాగాలన్నారు. కార్యక్రమానికి సుందరయ్య విజ్ఞాన కేంద్రం నాయకులు ధనుంజయ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు మోహన్, రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, ఉర్దూ యూనివర్సిటీ డీన్ అఖ్తర్ బాను, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల పెండింగ్ బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ కృష్ణారెడ్డి

కర్నూలు సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ, డీఏలు చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా కూడా ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. పీఆర్‌సీ ఇచ్చేంత వరకు తక్షణమే మధ్యంతర భృతిని ఇవ్వాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయుల హాజరు ఉదయం 9.15 గంటల వరకు, విద్యార్థుల హాజరు 10 గంటల వరకు వేసే అవకాశం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవిప్రకాష్, రాష్ట్ర కౌన్సిలర్లు వీరారెడ్డి, ఆదినారాయణ రెడ్డి, సుదర్శన్, జిల్లా నాయకులు మణికుమార్, శ్రీనివాస్ రెడ్డి, నాగేశ్వరయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల బకాయిలు వెంటనే చెల్లించాలి



పెన్షనర్లకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హరిని

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వం పెన్షనర్ల పెండింగ్ బకాయిలను సత్వరమే చెల్లించాలని కర్నూలు పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రంగారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కర్నూలు అబ్బాస్‌నగర్‌లోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కమిటేషన్ రికవరీ 11 ఏళ్ల 3 నెలలకే పూర్తి అవుతున్నా.. 15 ఏళ్ల వరకు రికవరీ చేయడం ద్వారా పెన్షనర్లు నష్టపోతున్నారని పేర్కొన్నారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు, సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రతి సభ్యుడి సహకారం అవసరమని తెలిపారు. పెన్షనర్ల బకాయిలను విడుదల చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా పెన్షనర్ల కోసం డాక్టర్ కేర్ హోమియోపతి వైద్యుల బృందం ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు కూడ ఈ సందర్భంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శేషయ్య, జయశంకర్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, ఎల్‌వీఎస్ నాయుడు, వెంకటేశ్వర్లు, కొండయ్య, బాలకృష్ణయ్య, నాగప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు



కోడుమూరు డీసీఎంఎస్‌లో నిల్వ ఉన్న యూరియా బస్తాలు

కోడుమూరు రూరల్: మండలంలో యూరియా కొరత లేదని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ శనివారం తెలిపారు. మండలంలోని కోడుమూరు, అనుగొండ, అమడగుంట్ల, ఎర్రదొడ్డి, ముడుమలగుర్తి, ప్యాలకుర్తి, వర్కూరు, పులకుర్తి, లద్దగిరి, గోరంట్ల రైతు సేవా కేంద్రాలతో పాటు, ఎరువుల దుకాణాల్లోనూ భారీగా యూరియా నిల్వలున్నాయన్నారు. శనివారం కోడుమూరులోని డీసీఎంఎస్‌కు 40 టన్నుల యూరియా వచ్చినట్లు తెలిపారు. యూరియా అవసరమైన రైతులు మాత్రమే కొనుగోలు చేయాలని, పుకార్లను నమ్మి అనవసరంగా కొని ఇండ్లలో నిల్వ పెట్టుకోవద్దని రైతులకు సూచించారు.

మానవత్వాన్ని చాటుకుందాం



నూతన కమిటీతో మానవత వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి, జిల్లా కన్వీనర్ మనోహర్‌రెడ్డి

కర్నూలు కల్చరల్: భగవంతుడు మంచి చెడులను లెక్కిస్తాడని సమాజ సేవలో మానవత్వాన్ని చాటుకుందామని మానవత సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం వీఆర్ కాలనీలోని మానవత సంస్థ కార్యాలయంలో మానవత నూతన కమిటీ సమావేశం, ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ సమాజానికి ఉచితంగా వైకుంఠ రథం, ఫ్రీజర్ బాక్స్‌లు అందివ్వడంతో పాటు రక్తదానం, అవయవాల దానం వంటి వాటిని ప్రోత్సహిస్తున్నామన్నారు. జిల్లా కన్వీనర్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవగా భావిస్తూ తమ సంస్థ అనేక సేవా కార్యక్రమాలు చేపడుతుందన్నారు డ్వామా పీడీ వెంకటరమణ, ప్రతిభా విద్యా సంస్థల అధినేత అరుణాచలం రెడ్డి, మానవత నూతన అధ్యక్ష కార్యదర్శులు రమణ వరప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో మానవత సంస్థ ప్రతినిధులు పాటిల్ హనుమంతరెడ్డి, శివారెడ్డి, తిరుపతి సాయి, సుధీర్, యానీ ప్రతాప్, అపర్ణ, లీల, తదితరులు పాల్గొన్నారు.

నిడ్జూరులో రక్షణ గోడ లేకుండా తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



పొంచి ఉన్న ప్రమాదం

కర్నూలు (రూరల్): కర్నూలు మండల పరిధిలోని నిడ్జూరు గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణ చర్యలు లేకపోవడంతో ప్రజలు ప్రమాద భయంతో జీవిస్తున్నారు. కర్నూలు-సుంకేసుల ప్రధాన రహదారి పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వల్ల ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ట్రాన్స్‌ఫార్మర్ పాతది కావడం, ఫేజ్ క్యారియర్లు, విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉండడం, చుట్టూ రక్షణ గోడ లేకపోవడం వల్ల ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో తెలయని పరిస్థితి నెలకొంది. ఈ రహదారిపై ప్రయాణించే వాహనదారులు, సమీప కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఎత్తును పెంచి, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ గోడను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.